

# జీవితం - సినిమా

నీయిల్లు రా ఫిల్ముగానూ! నీ కెప్పుడూ ఒక్కలాటి వేషాలే దొరకా! నీపిక్చరుకి ఒరిజినల్ మ్యూజిక్కు జమపడా! డబ్బులేకుండా చూసి హీరోయిను కాల్షీటివ్వా! ఘ్షంత పజ్జేశావూ! పొడుగు తగ్గించెయ్యడమే!! ఇంకేమన్నా ఉందా. నీకిలాటి పిదపకాలబ్బుద్ధులెలా పట్టుబడ్డాయరయ్యా! ఇంతటి ఒఘాయిచ్చాని కెలా వడిగట్టావయ్యా! ఇంకా నయం. నాతో అన్నావు. ఇంకెక్కడా అనబోకు. నీసెత్తిన కానీపెట్టి వేలంవేస్తే ఏగాణిగ్గొనడెవడూను. ఆఖరికి సిడివి తెగ్గోస్తే దేశం బాగుపడుతుందని తెగ్గోస్తున్న మున్షీ మహారాజ్జ్

రాజాజీలుకూడా నీ కార్యాన్ని హర్షించ లేవనుకున్నావో గాని.

సంస్కరణలంటే మజాకా అనుకున్నారా. ఇవాళ చెయ్యి అనగానే రేపొద్దున్న చేసిపారేస్తే ఏంగాను. అన్ని పన్లూ అలా చకచక తెమిలిపోయూరుకుంటే జనానికి మంద కొడితనం వచ్చేస్తుంది. సంస్కరించడానికి దుబారాలూ, పరిష్కరించడానికి సమస్యలూకూడా హారతికర్పూరంలా హారించిపోతాయి. కలికంలోక్కూడా లేకుండా పోతాయి. అప్పుడు నాయకులంతా ఏంగానూ. గోళ్ళు కొరుక్కుంటే మటుకు అవి ఎన్నాళ్ళొస్తాయిటా! వాళ్ళ కాలక్షేపం ఉండదు. పత్రికలకి రాసిందికేం వుండదు. జనానికి చదివిం దికేం వుండదు. పెద్దపెద్ద ప్రవక్తలు, కాదల్చుకున్న విమర్శ కులు, ఇతర అడ్డవైనవాళ్ళు, తలకిమాసినవాళ్ళూ ఒంటి కాలిమీద లేచి తిట్టిపోసిందికి రెడీగా ఏంవుంటుంది? కాంగ్రెసురాజకీయాల్ని, లంచగొండితనాన్ని, సమకాలిక సాహిత్యాన్ని ఎంతకని తిడుతూ కూచోగల్రు. వెధవది పాతసబ్జెటు. పైగా సాహిత్యాన్నేవన్నా అంటే సినిమా వాళ్ళలా పడూరుకోరుగదా. వెధవాయిలూ చెవలా యిలూ మీరుట్టి వెధవాయిలుస్మండీ. మీకు మారాత బోధపళ్ళేదుస్మండీ. పుట్టినవాళ్ళంతా బొడ్డూడని వెధ వాయిలేగదా! పుట్టబోయేవాళ్ళంత ప్రజ్ఞ మీకెక్కడేడి సిందిటా? మీకు మమ్మల్ని తిట్టిందికే గాక మెచ్చుకుంది గ్గూడా తాహతులేదుస్మండీ. అని తిట్టిపోస్తారాయె.

అంచేత సినిమానేనా దక్కించకపోతే యలా తిట్టుకుంటికి. కనస్ట్రక్టివ్ క్రిటిసిజమ్ ఇహ దేనిమీద అఘోరిస్తాం జెప్పు.

నీపాటి తెలితేటల్లేకనేనా—మినిష్టర్లు గిల్లిక్జాలు పెట్టుకుంటున్నారూ? వాళ్ళనూ్చసి నేర్చుకోవచ్చు యంతైనా. రాచకార్యాలన్నీ ఒక్కపెట్టున చక్కపెట్టి నిజంగానే ప్రభుత్వంచేసే పనుల్జేసేస్తే పాలిటిక్సులో డెడ్లాకొచ్చేయ్యదూ. వాళ్లు చూడు ఎంత పొదుపుగా స్తిమితంగా చూడముచ్చటగా పోట్లాడుకుంటున్నారో. ఒక ఆర్డరు ప్రకారం వంతువేసుకుని రోజు కొక్కటంటే ఒక్క స్టేటుమెంటు అంతే. ఉన్నాయిగదా అని అన్ని స్టేటుమెంట్లూ ఒక్కపూటే యిచ్చేదామనుకుంటే బాతూ బంగారు గుడ్లూ కథలా అయిపోతుందిగదా.

అంచేత మైడియర్ వెంకటేశం, అదీ ఇందులో ధర్మసూక్ష్మం. పొడుగు తగ్గించమన్నారుగదా అని నువ్వు చటుక్కున తగ్గించేస్తే కొంపలంటుకుపోతాయి. నురేం భయంలేదు. నీఇరవైవేల ఫుటేజికీ ఎన్నడూ మోసంరాదు. ఒక్కడుగు లోటురాదు. పాతిక ముప్పై వేలు తీయించల్చుకున్న హేమాహేమీలున్నారు వాళ్ళవెనక నిలబడు. మరేం ఢోకాలేదు.

* * *

అంతేకాదు. మరొక ఉపద్రవాన్ని గూడా నువ్వు కనుక్కోలేక పోతున్నావు ఈ నిడివి తగ్గిస్తివా, కథలో అక్కర్లేని పాటలూ, అనాకాణీ డాన్సులూ పోయి అవక తవకలూ అతుకులూ గట్రా లేకుండా నీటుగా ఉంటుంది.

ఆపళంగా అది సహజంగా అమరిపోయి జీవితానికి దగ్గిర్గా వెళ్ళిపోయిఅందులో కలిసిపోతుంది ఆపైనిహ చెప్పేదేవుంది.

ఇప్పటికీ మరో మరో విధాన గాపోయినా టెక్నికల్ హంగారమాల ధర్మవా అని పిక్చర్లు లైఫ్‌లైక్‌గా తయారైపోతున్నాయి సీనులో. స్మెల్లీసు వచ్చాక కంపు గొడుతున్నాయట. ఇహ నెప్పుడో అప్పుడు "ఫీలీస్" గూడా రాకతప్పదు. అనగా మధుబాల మొహాం నీకు బావుందని తోస్తే సినిమా చూస్తూ చూస్తూ ఆవిడ బుగ్గమీద చిటికెయ్యొచ్చుట. దిలీప్‌కుమార్ ధోరణి నచ్చకపోతే భుజంతట్టి అబ్బీ ఇటు తిరిగి నటించమనొచ్చు. మరోహాడూ మరో హాడూ పేట్రేగిపోతూంటే నెత్తినో మొట్టికాయ మొట్టచ్చు. ఎవడన్నా ఏడుస్తూవుంటే వాణ్ణి కావలించుకుని భోర్న మనవూఁయాడవచ్చు. ఈ విధంగా జీవితం సినిమా ఏకమైపోతాయి.

ఒకపక్క ఇదిలా ఉండగా మరోహ పక్కనించి సత్యజిత్రాయిలాంటివాడున్నదున్నట్లు చూపించేసి ఫిలిమ్‌ని జీవితానికి దగ్గిర్గా లాక్కొచ్చేస్తున్నాడు.

అలాయితే మంచిదేగా అనేవు కొంపదీసి. వెనకటికి జర్మనీవాడూ, రష్యావాడూ తగూలాడుకున్నపుడు రష్యావాళ్ళు జర్మనీలోకీ, వాళ్ళు రష్యాలోకీ వచ్చేసి రష్యా జర్మనీ, జర్మనీ రష్యా అయూరుకున్నట్టు జీవితం సినిమా, సినిమా జీవితం అయిపోగలవు. ఆ లోపలే డబ్బు నోళ్లు ఖుందికీ ఛాన్సుండదు. సినిమాలన్నీ జీవితంలా ఉంటే, అసలే

జీవితం అంటే మొహమ్మొత్తున్న జనం సినిమాకెందుకురా అని మానీగలరు.

అంచేత ఇపుడు సినిమా ఉన్నదున్నటుంచేయాలి. జీవితాన్ని సినిమాదగ్గరికి జరపాలే తప్ప సినిమాని యింత మాత్రం ఇటు లాక్కూడదు. ఇందులో శ్రమా లేదు. జీవితం సహజంగానే సినిమావేపు వెళిపోతుందిగదా. సినిమా కథలాగే తలా తోకా లేకుండా, అస్తవ్యస్తంగా అతుకుల బొంతలా తయారవుతూంది గదా. తెలుగు సినిమాలో కారెక్టర్లలాగే జీవితంలో మనుషులూ, పెద్దలూ, పిన్నలూ అవకతవకగా మాటాడుతూ నడుస్తున్నారుగదా. అర్థంపర్థం లేకుండా పుడుతూ గిడుతున్నారుగదా సినిమాలో కామెడీ లాగే అన్ని రాజధానుల్లోనూ సర్కారు ప్రహసనాలు సాగుతున్నాయిగదా. ఛీఫ్‌మినీస్టర్లు, మిస్చీఫ్ మినిస్టర్లు నవరసాలు పోషిస్తున్నారుగదా. సినిమాలో డైలాగులాగే నాయకులు — రాజకీయాలవాళ్ళే అని గాదు — సినిమావాళ్ళు, సాహిత్యపువాళ్ళు డైలాగు స్టేటుమెంట్లిచ్చేస్తున్నారు గదా. డైలాగులాగే కృత్రిమంగా మాటాడుతున్నారుగదా.

సినిమాలో డైరెక్టరుగాళ్ళలాగే జీవితంలో సాహిత్య పర్వతాలు, పానకాలు, రాజకీయ మేరువులూ, నైతిక ఎవరెస్టులూ, పాత్ర పోషణగురించి బొత్తిగా పట్టించుకోడం మానేశారు — మరోడి మరోడి పాత్రపోషణనికాదు. ఎవరికి వారే శాయశక్తులా కారెక్టరైజేషన్‌లు చేస్తున్నారు. జీవితం ఇంతజోరుగా ఉత్సాహంగా సినిమాదగ్గిరకి జరిగి

పోతూఉంటే మన సినిమా, జీవితానికి చాలా దూరం అన్న చెవలాయి ఎవడోయ్? అంట—

*　　　*　　　*

ఆయ ఆయ దయచెయ్యండి. ఇందాకట్నించి ఒక్కలాగ ఆ యొక్క స్వాతివానకి ముచ్చెపుచిప్పలాగ తమరి కోసమే వెయిట్ చేస్తున్నా. ఏవుందీ... ఈ దిప్పకాయ కనిపిస్తే సొల్లుకబుర్లు చెబుతూ కూచున్నా. ధ్యాసంతా మీమీదనేస్మండీ—

